


అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.7 (గురువారం)
కనిష్ఠం : 29

అందాల కశ్మీరం.. ఉగ్రదాడితో కాష్మోరాగా మారిపోయింది.. కాష్మోరా సినిమా చూడాలంటేనే భయపడినట్టు.. ప్రస్తుతం కశ్మీరం వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.. వేసవి సెలవుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న వందలాదిమంది తమ టూర్ క్యాన్సిల్ చేసుకుంటున్నారు.. ఆ అందాల రాక్షసిని తిలకించాలంటే ముందు మేం ఉండాలి కదా.. అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు..

- కాకినాడ,ఆంధ్రజ్యోతి



ప్రకృతి వలయం : కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతం



మంచుకొండల్లోని సంద్రమా : కశ్మీర్ సోనామార్గ్‌లో గురువారం మంచు ఇలా..

# అందాల రాక్షసివే.. కశ్మీర్..టెర్రర్

రాజమహేంద్రవరంలో ఓ వ్యాపారి వేసవి సెలవుల్లో కుటుంబంతో సహా కశ్మీర్ వెళ్లాలని ముందే ప్లాన్ చేశారు. ఆరుగురి కోసం ముందే ఫ్లైట్ టిక్కెట్స్, హోటల్స్ బుక్ చేసుకున్నారు. తీరా కశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంతో అక్కడకు వెళ్లలేక టూర్ క్యాన్సిల్ చేసుకున్నారు.

కాకినాడలో రెవెన్యూశాఖకు చెందిన ఆరుగురు ఉద్యోగులు సెలవుపెట్టి కశ్మీర్‌కు బయలుదేరారు. తీరా ఢిల్లీలో విమానం దిగి ఉదయాన్నే కశ్మీర్‌కు బయలుదేరాలనుకునేలోగా ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్ ట్రిప్ రద్దు చేసుకున్నారు. తిరుగు విమానం టికెట్లు ఈనెల 26వ తేదీకి బుక్ చేయడంతో చేసేదిలేక ఢిల్లీలోనే ఉండిపోయారు. మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉండిపోయి చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాద దుశ్చర్య జరగడానికి ఐదు రోజుల ముందే అక్కడి నుంచి కాకినాడకు వచ్చిన కొందరు పర్యాటకులు జరిగిన సంఘటన తల్చుకుని బెంబేలెత్తిపోతున్నారు. తాము పహల్గాం నుంచి బైరసన్‌కు గుర్రాల్లో వెళ్లామని, అదే ప్రాంతంలో నరమేధం జరిగిందని తెలిసి ఒళ్లు జలదరించిందని కాకినాడ నగరానికి చెందిన కొందరు పర్యాటకులు వివరించారు.

కశ్మీర్‌లోయలోని పహల్గాంలో ఈనెల 22న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో కశ్మీర్‌లో ఉన్న పర్యాటకులు ప్రాణభయంతో తిరుగుముఖం పట్టారు. దీంతో చాలావరకు కశ్మీర్ ఖాళీ అయిపోయింది. మరోపక్క అక్కడకు సరదాగా వెళ్లాలని ముందే ప్లాన్ చేసుకున్న అనేక కుటుంబాలు ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నాయి. ఈ వేసవిలో సరదాగా కశ్మీర్ వెళ్లడానికి ఉమ్మడి జిల్లాలో పలు కుటుంబాలు టూర్ ఏజెంట్లను సంప్రదించి నెల రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడు ఉగ్రవాదుల దుశ్చర్యతో కశ్మీర్‌కు వెళ్లాలనుకున్న పర్యాటకులు రద్దు చేసుకుంటున్నారు. దీంతో ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు.

## బుకింగ్‌లు రద్దు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి దేశ, విదేశాల్లో వివిధ టూరిస్ట్ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల కోసం 75 వరకు టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీలున్నాయి. స్వదేశంలో ఏర్పాట్లకు 42 వరకు సర్వీసులు అందిస్తున్నాయి. ఈనెల, వచ్చే నెలలో కలిపి ఈ రెండు నగరాల నుంచి దాదాపు 170 వరకు వివిధ కుటుంబాలు, గ్రూపులు ఢిల్లీ, కశ్మీర్‌కు బుకింగ్‌లు చేసుకున్నాయి. కానీ ప్రస్తుతం అక్కడకు వెళ్లడం ప్రమాదంతో కూడుకున్నందున వీరంతా తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటున్నట్టు కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన రెండు టూర్ ఏజెన్సీలు వివరించాయి. ఉమ్మడి జిల్లాలో కశ్మీర్ టూర్‌కు టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులకు హోటల్స్ బుకింగ్ రద్దుకు అంగీకరించగా, కొన్ని విమాన కంపెనీలు టికెట్ బుకింగ్ ఆప్షన్‌లో క్యాన్సిలేషన్ లేదేని తెగేసి చెబుతున్నాయి. కశ్మీర్ వెళ్లేవారంతా ఢిల్లీ నుంచే రైళ్లలోను, విమానాల్లోనూ వెళతారు. దీంతో కొందరు డబ్బులు వదిలేసుకుని పర్యటన రద్దు చేసుకోగా.. కొందరు పర్యాటకులైతే డబ్బులు వదులుకోలేక ఢిల్లీ వరకు వెళ్లి కొన్నిరోజులు ఉండేలా సిద్ధమవుతున్నారు. ఇలా కొందరు పర్యాటకులు ఈనెల 26, 27 తేదీల్లో పయనమవుతున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీ వివరించింది. ఇప్పటికే శ్రీనగర్‌లో ఉన్న పర్యాటకులు వెనక్కు రావడానికి విమానం టిక్కెట్లు బుక్ చేయాలని, లేదా ఢిల్లీదాకా తెలిసిన టూర్ ఏజెన్సీ వాహనాలు బుక్‌చేయాలని కోరుతున్నట్టు సమాచారం.

### కశ్మీర్‌కు ఇప్పుడే ఎందుకంటే..

జమ్ముకశ్మీర్ ఏప్రిల్ నుంచి మరింత అందంగా మారుతుంది. ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తుంది. మార్చి మూడో వారం వరకు కశ్మీర్‌లోని శ్రీనగర్, పహల్గాం, గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాల్లో మంచు కురుస్తుంటుంది. మార్చి ఆఖరు నుంచి.. ఏప్రిల్ ఆరంభంలో మంచు కురవడం ఆగిపోయి వందల మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన భారీ మంచు కొండలు కరగడం మొదలవుతాయి. ఈ సమయంలో హిమాలయాలు, దాల్ లేక్‌లో పడవ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. అందుకే ఈ సమయంలో పర్యాటకులు దేశవ్యాప్తంగా కశ్మీర్‌కు పోటెత్తుతారు. ప్రతి ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ సీజన్‌లో కశ్మీర్‌కు గ్రూపు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

### వేసవిలో వెళ్లేది ఇందుకే..

ఏప్రిల్‌లో మనకు ఎండలు మండిపోతుంటాయి. 38 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉంటుంది. కశ్మీర్‌లో పగటి ఉష్ణోగ్రత 5 నుంచి 13 డిగ్రీల వరకు ఉంటుంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనేక చోట్ల మైనస్ 3 డిగ్రీలు ఉంటుంది. గురువారం కశ్మీర్‌లోని సోనామార్గ్‌లో రాత్రి 8 గంటలకు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు నమోదైంది. బుధవారం అయితే రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉగ్రవాద దుశ్చర్య జరిగిన పహల్గాంలోని బైసరన్‌లో గురువారం రాత్రి రెండు డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కశ్మీర్‌లో అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సైతం ఆరు నుంచి ఎనిమిది డిగ్రీలే ఉంటోంది. ప్రకృతి అందాలు, హిమాలయ సోయగాలు ఈ సమయంలో ఎంతగానో అలరిస్తాయి. దీంతో కశ్మీర్‌కు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

- ఉగ్రవాదుల దుశ్చర్య
- పర్యాటకుల్లో గుబులు
- పలు బుకింగ్‌లు రద్దు
- టూర్ ఏజెన్సీల గగ్గోలు
- కొంత మంది ఢిల్లీకి పయనం
- అక్కడ చిక్కిన టూరిస్ట్‌లు
- తిరిగి వచ్చేందుకు ఒత్తిడి
- ఖాళీ అవుతున్న కశ్మీరం



# ఏ రైలూ.. ఖాళీ లేదు..!

- రైళ్లన్నీ ఫుల్.. రిజర్వేషన్లు నిల్
- వేసవికి విహార యాత్ర ఎలా?
- తిరుపతికి డబుల్ డెక్కరే గతి
- బెంగళూరు..చెన్నైకి ఖాళీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వచ్చేశాయి. ఏడాది అంతా చదువులతో కుస్తీ పట్టే పిల్లలు.. ఇంటి పట్టునే ఉంటూ కుటుంబం బాగోగులు చూసుకొనే గృహిణులు.. ఉదయం ఆఫీస్‌కి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరే ఉద్యోగులు.. కాస్త సేదతీరాలనుకొనే రోజులు ఏప్రిల్, మే నెలలు.. ఏడాదిలోని మిగతా నెలల్లో పిల్లలకు స్కూలు ఉండడంతో ఎక్కడికైనా వెనకడుగు వేస్తారు. వేసవిలో పిల్లలకు స్కూళ్ల సెలవులు ఇస్తారు కాబట్టి.. అలా ఎక్కడికైనా విహారయాత్రకు వెళదామని ప్లాన్ చేసుకుంటారు. ఏ టూర్‌లో అయినా రైలు ప్రయాణమే కీలకం. రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు చేయించుకుంటే ఫర్వాలేదు. ఇప్పటికిప్పుడు బయలుదేరితే మాత్రం కష్టమే. రైళ్లలో ఇప్పటికే మే నెలాఖరు వరకూ స్లీపర్‌తోపాటు ఏసీ క్లాసుల రిజర్వేషన్లు నిండుకున్నాయి. వెయిటింగ్ లిస్టులోకి ఎప్పుడో వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఏ రైలు చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది.

- సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్ల నడిచే తేదీలను పొడిగించడం మినహా చెప్పుకోగ్గ స్థాయిలో ఈ ప్రాంతం వాళ్లకు ఈ వేసవి ప్రత్యేక రైళ్ల విషయంలో ఆ శాఖ దయ చూపలేదు. హైదరాబాద్‌కి వందే భారత్‌లు నడుస్తున్నా చార్జీలు సామాన్యుడు భరించలేనంతగా ఉన్న విషయం తెలిసిందే.
- వేసవిలో ముఖ్యంగా తిరుపతికి రద్దీ ఉంటుంది. కానీ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్టు 100కి చేరగా, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో టికెట్లే లేవు. దిబ్రూగఢ్, సంత్రాగచి, హౌరా నుంచి వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు క్లోజ్ అయిపోయాయి. వారంలో మూడు రోజులు నడిచే డబుల్ డెక్కర్‌కి కొన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు మినహా ఏ రైలుకూ తిరుపతికి రిజర్వేషన్లు ఖాళీ లేవు.
- బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా- హౌరా -న్యూతిన్సుకియా, టాటా, భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లు రాజమండ్రి గుండా వెళుతున్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమండ్రి వస్తుంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతి న్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికో సారి, గువాహటి నుంచి వారానికి మూడు సార్లు రైళ్లున్నా బోగీల్లో కాలుపెట్టలేం.
- చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సుకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా- కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికోసారి, సిల్చార్- కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా -తిరుచిరాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్ -త్రివేండ్రం(మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శని వారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగుపెట్టడానికి వీలుండదు.

### ఇంటర్ సిటీలు వేయాలి..

ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, అసోం, బిహార్ నుంచి ఉపాధి పనుల నిమిత్తం కూలీలు పెద్ద సంఖ్యలో కేరళ, తమిళనాడు, కర్నాటక వెళుతుంటారు. వేసవిలో తిరుగు ప్రయాణమవుతారు. అందుకే చెన్నై, బెంగళూరు, అళపుజ, తిరువనంతపురం నుంచి సిల్చార్, న్యూతిన్సుకియా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఖాళీ ఉండదు. ఈ క్రమంలో వేసవి సెలవులకు విహారయాత్రలకు వెళదామని అనుకున్న వారితోపాటు ఆస్పత్రి పనులపై చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొత్తగా వారాంతపు, బైవీక్లీ రైళ్లు వేస్తున్నా ఈ ప్రాంతం వాసులకు ఉపయోగం ఉండడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వేసవిలో నైనా విశాఖ-విజయవాడ,విజయవాడ-చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖ- భువనేశ్వర్,రాజమండ్రి-విజయవాడ, విశాఖపట్నం ఇంటర్ సిటీలు నడపితే నాలుగు జిల్లాల ప్రయాణికుల తిప్పలు తగ్గే అవకాశం ఉంది.

# జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 379 కేంద్రాలు

- ఉత్పత్తి లక్ష్యం 5.86లక్షల మెట్రిక్ టన్నులు
- 34 శాతం మేర 2 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ మహేష్‌కుమార్
- గిట్టుబాటు ధరకే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించండి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రబీలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 379 కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రబీ సాగులో పండించిన ధాన్యాలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేయనున్నారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో 1.64 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. వీటి నుంచి 5.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనిలో భాగంగా 34 శాతం అంటే జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించారు. అయితే రాష్ట్రంలో ఉన్న ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ లక్ష్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని రైతుల నుంచి క్వింటాల్ రూ.2320కు, 75కిలోల బస్తాను రూ.1740కు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కామన్ వెరైటీ రకం క్వింటాల్ రూ.2300కు, 75కిలోల బస్తాను రూ.1725కు కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మిల్లర్లను ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో కూడా గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నందున రైతులు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేకుండా ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని అధికారులు కోరుతున్నారు. ఇందుకు జిల్లావ్యాప్తంగా 379 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రభుత్వ నిర్దేశాల మేరకు చేపట్టనున్నారు. వీటిలో పనిచేసేందుకు సిబ్బందిని కూడా నియమించారు. ఈ కొనుగోలు ప్రక్రియను అమలు చేసేందుకు వీలుగా 268 టీఏలు, 243 డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు 141, కస్టోడియన్ ఆఫీసర్లతో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు సేకరణకు అవసరమైన తేమ పరిశీలన, పరికరాలు, నిధుల విషయంలో ఆర్ఎస్కేల వద్ద ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ఒక రకమైన పరికరాలను ఇందుకోసం ఏర్పాటు చేశారు. రబీ ధాన్యం సేకరణలో ఎటువంటి సందేహాలు ఉన్నా జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటుచేసి వాటి ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ప్రతీ మండలంలో ఉత్పత్తులు అంచనా వేస్తూ అన్ని రైతు సేవా కేంద్రాల లక్ష్యాలను నిర్దేశించనున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు, మిల్లర్లు, మార్కెటింగ్ తూనికలు, కొలతులు, జిల్లా సహకార సంస్థ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, డీస్వో అడపా ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబులతో పాటు పలు శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష చేశారు.

## ఆధునిక సాంకేతికతతో రీసర్వే : జేసీ



రెవెన్యూ సర్వే సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న నిషాంతి

అమలాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ సర్వే సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి రెండో దశ రీసర్వే ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా రీసర్వే నిర్వహించాలన్నారు. రెవెన్యూ రికార్డుల్లోని లోపాలను సరిదిద్దడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. సుదీర్ఘకాలంగా హద్దులు తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందన్న విషయాలను రైతులకు తెలియజేయాలన్నారు. రీసర్వే ప్రక్రియపై అవగాహన సభలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. జూన్ 21 నాటికి రెండో దశ సర్వే పూర్తి చేయాలన్నారు. డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, కె.మాధవి, సర్వేఅండ్ ల్యాండ్‌రికార్డ్స్ ఏడీ కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

## గురుకులాల్లో చేరేందుకు నేడు ప్రవేశ పరీక్షలు : డీఆర్వో



అధికారులతో సమీక్ష చేస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో చేరేందుకు శుక్రవారం ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు జరిగే పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత, పరీక్షా కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులు, లైన్ డిపార్టుమెంట్ అధికారులతో ప్రవేశ పరీక్షల సన్నద్ధతపై సమీక్షించారు. గురుకుల పాఠశాలలు, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్డీసీ సెట్-2025 ప్రవేశ పరీక్షల నిర్వహణకై జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు బ్యాక్‌లాగ్‌కు సంబంధించి 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. జూనియర్ కళాశాల, రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం పరీక్షలకు జిల్లాలో 285 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. వీరి కోసం అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. గురుకులాల్లో 5, 6, 7, 8 తరగతుల ప్రవేశ పరీక్ష శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్నారు. కళాశాలల్లో ప్రవేశంకోసం మధ్యాహ్నం 2.30 గంటలనుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, చీఫ్ సూపరింటెండెంట్‌లు జి.నాగసుబ్బారావు, వి.విజయకుమారి, ట్రాన్స్‌కో ఏఈ ఆనందరాజు పాల్గొన్నారు.



## విద్యార్థిని హారికకు కలెక్టర్ అభినందనలు



హారికను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈవో సలీంబాషా

మలికిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షా ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఇరుసుమండ విద్యార్థిని కె. హారికను కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, హెచ్ఎం బి. మెహర్ పాల్గొన్నారు.

## నేడు పిఠాపురంలో.. డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



- రచ్చబండలో ముఖాముఖి
- అభివృద్ధి పనులకు శ్రీకారం

6



# అంతరిక్ష అనుభవంలోకి..

## వెల్‌కం సునీత.. ఆకట్టుకున్న లఘుచిత్రం

ఆంధ్రజ్యోతి-అమలాపురం రూరల్




సునీతా విలియమ్స్.. ఆ పేరు తెలియనివారెవరూ ఉండరంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అంతరిక్ష పరిశోధనలకు వెళ్లిన సునీతా విలియమ్స్ ఎదుర్కొన్న ఇబ్బందులు.. తిరిగి భూమికి అడుగిడినప్పుడు ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆడబిడ్డ పుట్టింటికి వచ్చినంత ఆనందం అనుభవించారు. ఆ ధీర వనిత, అంతరిక్ష అనుభవాలను నేపథ్యంగా తీసుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని సమనస గ్రామంలో ఉన్న శ్రీరామా పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ తీసిన లఘుచిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అదే పాఠశాలలో పది రోజులపాటు తీసిన లఘు చిత్రాన్ని ఆయనే స్వయంగా ఎడిటింగ్ చేయడానికి నెల రోజుల వ్యవధి పట్టింది. ప్రేక్షకులందరినీ అంతరిక్షంలోకి తీసుకువెళ్లిన అనుభూతి కలిగించారు. వెనుకభాగంలో ఏర్పాటుచేసిన గ్రీన్ మ్యాట్‌పై సీన్‌ల వారీగా లొకేషన్లు మారుస్తూ (గ్రాఫిక్ డిజైన్లతో) లఘుచిత్రాన్ని నిర్మించారు. అంతరిక్షాన్ని తెరపై ఆవిష్కరించడంతో పాటు పాత్రధారులందరికోసం ప్రత్యేక కాస్ట్యూమ్స్‌ను కొనుగోలు చేశారు. సునీతా విలియమ్స్ సాహస గాథపై ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ రచనా, దర్శకత్వంలో రూపొందించిన ఈ లఘుచిత్రం ఆహూతులందర్నీ ఎంతగానో ఆకట్టుకుంది. 30 నిమిషాల నిడివి గల సాహస గాథను వెల్కమ్ సునీత... అంటూ తెరపైకి ఎక్కించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది. సునీతా విలియమ్స్ నాసా కేంద్రం నుంచి అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి తిరిగి భూమిపైకి అడుగిడే వరకు పలు అంశాలను లఘుచిత్రంలో పొందుపరిచిన తీరు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. సమనసలోని శ్రీరామా పబ్లిక్ స్కూలు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లఘుచిత్రాన్ని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు తిలకించి లక్ష్మీగణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 2024 సంవత్సరంలో నాసా నుంచి అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన సునీత, విల్మోర్ సుమారు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుని ధైర్యసాహసాలతో తిరిగి ప్రాణాలతో భూమి మీదకు వచ్చిన ఎన్నో ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా ప్రత్యేక గ్రాఫిక్స్‌తో తీశారు. సునీత విలియమ్స్ పాత్రలో పాఠశాల విద్యార్థిని టి.శరణ్య, విల్మోర్ పాత్రలో ఎస్.గుణశేఖర్, చీఫ్ సైంటిస్ట్ పాత్రలో వి.వినోద్‌తోపాటు ఇతర విద్యార్థులు అనేక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి రచనా, నిర్మాత, దర్శకత్వం, ఎడిటింగ్, గ్రాఫిక్స్‌ను లక్ష్మీగణేష్ నిర్వహించారు. ఈ లఘు చిత్ర ప్రదర్శనను ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తిలకించి ప్రత్యేకంగా అభినందించారు.

లఘుచిత్రంలోని నాసా కేంద్రంలో ఘట్టాలు





కథ, దర్శకత్వం వహించిన లక్ష్మీ గణేష్



నాసా కేంద్రంలో చర్చలు జరుపుతున్నట్టు తీసిన సీను

# తరతరాల 'చుట్ట'రికం..!



కాకినాడ రామకృష్ణారావుపేటలో చుట్ట చుడుతున్న దృశ్యం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాలం మారుతోంది.. కాలానుగుణంగా జనాలు మారుతున్నారు. వారి అలవాట్లను మార్చుకుంటూ వస్తున్నారు. కాలగర్భంలో కొన్ని కలిసిపోతున్నా.. సంప్రదాయ పొగాకుతో తయారు చేసే చుట్లకు మాత్రం గిరాకీ తగ్గలేదు. రకరకాల సిగరెట్లు మార్కెట్లోకి వచ్చినా.. వీటి వినియోగం మాత్రం ఆగలేదు అనేందుకు ఈ చిత్రాలే నిదర్శనం.. అన్నింటా యంత్ర తంత్రమే సాగుతుండగా.. చుట్టల తయారీ మాత్రం చేతిలోనే సాగుతోంది. తరతరాలుగా కొందరు చుట్ల తయారీతోనే ఉపాధి పొందుతున్నారు. కాకినాడ నగరంలోని రామకృష్ణారావుపేటలో కొందరు ఇలా చుట్టలు చుడుతూ కనిపించారు. ఒకప్పుడు పావలాకు ఐదు చుట్టలు అమ్మితే.. ప్రస్తుతం ఒక చుట్ట ధర రూ.2కి చేరింది. ఒక్కో వ్యక్తి రోజుకి 500 వరకు చుట్టలు చుట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలా పలు కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

# 'సివిల్స్'లో మెరిసిన తాపేశ్వరం యువకుడు

- ఆలిండియా స్థాయిలో 333వ ర్యాంకు
- మూడో ప్రయత్నంలో విజయం సాధించిన పవన్



యండ్రు పవన్‌కుమార్

మండపేట,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన యండ్రు పవన్‌కుమార్ ఆల్‌ఇండియా స్థాయిలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన మొదటి నుంచి చదువులో రాణించేవారు. పవన్ విద్యాభ్యాసం 1నుంచి పదో తరగతి మండపేట పట్టణంలో సాగింది. ఇంటర్ విజయవాడలో చదువుకున్నారు. అనంతరం బెనారస్‌లో ఐఐటీ మెకానికల్ చేశారు. సివిల్స్‌లో రెండుసార్లు విఫలమైనప్పటికీ మూడో ప్రయత్నంలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు.తాను ఎప్పటికైనా ఐఏఎస్ కావాలన్న కోరిక ఉండేదని, ఇపుడుతనకు వచ్చిన ర్యాంకుకు ఐఆర్ఎస్ లేదా ఐఎఫ్ఎస్ రావచ్చని పవన్ తెలిపారు. ఆయన తండ్రి ఎరువులు వ్యాపారి. వీరిది వ్యవసాయ కుటుంబం. తమ కుమారుడు సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంపట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు పిఠాపురంలో..

# డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు వచ్చిన పోలీసు బందోబస్తు

- రచ్చబండలో ప్రజలతో ముఖాముఖి
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- పర్యటనకు భారీ బందోబస్తు

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో ఒక్క రోజు పర్యటన నిమిత్తం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుక్రవారం రానున్నారు. ఈ పర్యటన నిమిత్తం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శుక్రవారం ఉదయం విశాఖ నుంచి రాజమహేంద్రవరం ప్రత్యేక విమానంలో వస్తారు. అక్కడినుంచి ఉదయం 9.20గంటలకు పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడ ఉదయం 9.30గంటల నుంచి 10.15 గంటల వరకూ నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందుకుగాను విస్తృత ఏర్పాట్లు చేశారు. అక్కడినుంచి మధ్యాహ్నం 11గంటలకు కొత్తపల్లి చేరుకుని అక్కడ టీటీడీ కల్యాణ మండపం నిర్మాణపనులకు భూమిపూజ నిర్వహిస్తారు. అక్కడినుంచే గొల్లప్రోలు, చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానాల్లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు చేరుకుని అక్కడ జరిగే టైలరింగ్ ఉచిత శిక్షణా తరగతుల్లో పాల్గొన్నవారికి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాంత్రీకరణ పథకం ద్వారా పరికరాలు, రైతులకు టార్పాలిన్లు అందజేస్తారు. మధ్యాహ్నం 12.35గంటలకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని 100 పడకల ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడినుంచే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం 1.15 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో మంగళగిరికి మధ్యాహ్నం 2.20గంటలకు చేరుకుంటారు.

### పర్యటనకు భారీ బందోబస్తు


డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు 350మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 17మంది సీఐలు, 35మంది ఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, మహిళాపోలీసులు 300మందిబందోబస్తు విధుల్లో ఉంటారు. వీరికి అదనంగా ఏఎస్ఎస్ పార్టీలు, రోప్ పార్టీలు ఉన్నాయి. వీరు గురువారంసాయంత్రానికే ఇక్కడకు చేరుకున్నారు.

## నివాళిగా..






కశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాలకు వ్యతిరేకంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో అఖండ భారతదేశం ఆకృతిలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం. అలాగే చింతూరులో హిందు, ముస్లింల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం - రాజానగరం/చింతూరు



# అవగాహనతోనే మలేరియా దూరం

కంటికి కనీకనిపించని చిన్న దోమ ద్వారా అనేక విష జ్వరాలు సోకి అవి మరణం వరకు తీసుకెళ్లిన ఎన్నో సంఘటనలను చూశాము. అయితే ముందస్తు జాగ్రత్త చర్యలు, అవగాహన కార్యక్రమాలతో మలేరియా దరిచేరకుండా తరిమేయవచ్చని వైద్యులు చెప్తున్నారు.







జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనాఫిలిస్ అనే దోమ కాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఇది సోకిన వ్యక్తికి రక్త మార్పిడి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా వాంతులు, నిస్సత్తువ, తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ జ్వరపీడితులకు సకాలంలో వైద్య చికిత్స అందించకపోతే తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. మలేరియా తీవ్రతరమైతే రక్తహీనత, విరోచనాలు, పొత్తుకడుపులో నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు, కండరాల నొప్పులు కనిపిస్తాయి. గత ఏడాది డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన తాజా ప్రపంచ మలేరియా నివేదికలో మలేరియా కేసులు, మరణాలు గణనీయంగా తగ్గినట్టు వెల్లడించింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా 2024లో కేవలం ఐదు మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఒక్క మరణం కూడా సంభవించలేదు.

### ఒక్క కేసు కూడా నమోదు కాలేదు



డాక్టర్ విల్సన్, జిల్లా మలేరియా అధికారి

ఈ ఏడాది ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాకపోవడం ప్రజారోగ్య పరిరక్షణలో ఒక మంచి పరిణామం.

### నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

గత ఏడాది 1,98,105 మలేరియా పరీక్షలు నిర్వహించగా కేవలం ఐదు మాత్రమే పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 65,662 పరీక్షలు నిర్వహించగా కేసు లేమీ నమోదు కాలేదు. ప్రజలు, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, స్వీయ పరిరక్షణ పాటించడం ద్వారానే ఇది సాధ్యమైంది. కాకినాడను మలేరియారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది.

# బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎనిమిది కళాశాలలకు చెందిన 493 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరయ్యారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎగ్జామినేషన్స్ అబ్జర్వర్‌గా డాక్టర్ లావణ్య, చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శశి, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఇన్విజిలేటర్లుగా వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది ఉద్యోగులు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు డాక్టర్ శశి తెలిపారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినులు





విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు

# ముగ్గురు విద్యార్థుల ఎంపిక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ సంయుక్తంగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లిలో ప్రత్యేక అవసరాల (సీడబ్ల్యుఎస్ఎన్) విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో కాకినాడ జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో జాతీయ పోటీలకు ఎంపికైన జి.సురేష్‌కుమార్ (రన్నింగ్), కె.సత్యదుర్గ పెదరాజు (బోసే గేమ్), కె.ప్రేమ్‌కుమార్ (రన్నింగ్)లను అదనపు పథక సంచాలకుడు పి.వేణుగోపాలరావు అభినందించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో-ఆర్డినేటర్, సీఎంవో చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉడిమూడి వంతెన నిర్మాణంపై

# డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు



మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ

పి.గన్నవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ ద్వారా నిర్మితమవుతున్న మేజర్ వంతెనలు, రహదారుల వివరాలతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి వద్ద ఏఐబీ నిధులు రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న ఉడిమూడి-పెదపూడిలంక వంతెన నిర్మాణం పనులు, వరదల సమయంలో లంకగ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించారు. ఇది పంచాయతీరాజ్ ద్వారా జరుగుతున్న అతిపెద్ద వంతెనగా స్పష్టం చేశారు. దీంతో పవన్‌కల్యాణ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినట్లు రాంబాబు తెలిపారు. ప్రదర్శనలో ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ఈఎన్‌సీ బాలునాయక్ పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలకు అరుదైన గుర్తింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం సందర్భంగా ఐపీ, సంగీతం-ఫీల్ ద బీట్ ఆఫ్ ఏపీ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఏపీఎస్‌సీహెచ్ఈ రాష్ట్రస్థాయి అవార్డును తమ కళాశాల దక్కించుకుందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద కళాశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన అత్యుత్తమ కళాశాల ఆడియో విజువల్ ప్రదర్శనకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు.

ఏలేరులో స్నానానికి దిగి..

# అమ్మమ్మ, మనవడు మృతి

● ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువ వద్ద ఘటన
● మృతులది ప్రత్తిపాడులోని ఏగులమ్మ గుడి ప్రాంతం



ఏలేరులో స్నానాలకు దిగి మృతి చెందిన అమ్మమ్మ మనవడు



అరట్లకోట సత్యవతి, గోర్స వీరమనోజ్(ఫైల్)

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడుకు చెందిన అమ్మమ్మ, మనవడు బుధవారం ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువలో దిగి ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందారు. ఇద్దరు మృతి చెందారన్న విషయం గురువారం ఉదయం తెలియడంతో ప్రత్తిపాడులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రత్తిపాడు ఏగులమ్మ గుడి సమీపంలో ఉంటున్న అరట్ల కోట సత్యవతి(50), గోర్స వీర మనోజ్(12) అమ్మమ్మ, మనవడు. వీరిద్దరూ పొద్దుపోయిన తర్వాత యర్రవరం ఏలేరునదిలో స్నానం ఆచరించేందుకు ప్రత్తిపాడు నుంచి బయల్దేరి వెళ్లారు. ఏలేరు నది ఒడ్డున చెప్పులు వదిలి స్నానం చేసేందుకు దిగిన వీరు ఊబి ఉన్న ప్రాంతంలో దిగడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో 11గంటల సమయంలో ఏలేరు నది వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా సత్యవతి, మనోజ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. సత్యవతి అమ్మవారి ఆలయం వద్ద సేవ చేస్తూ ఉంటుందని భర్త నాగేశ్వరరావు తెలిపారు. మనోజ్ 5వ తరగతి చదువుతున్నట్లు తండ్రి నాగేశ్వరరావు తెలిపారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రత్తిపాడులో విషాదఛాయలు

ప్రత్తిపాడులోని ఏగులమ్మగుడి సమీప ప్రాంతానికి చెందిన అరట్లకోట సత్యవతి, మనవడు గోర్స వీర మనోజ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరి మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలు సత్యవతి, భర్త నాగేశ్వరరావుకు ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో వెంకటరమణమ్మ, రాజుల దంపతుల కుమారుడు గోర్స వీర మనోజ్. అమ్మమ్మ చేరికలో ఉండడంతో బాలుడు ఏలేరు నది స్నానానికి తీసుకెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. వేగలమ్మ ఉత్సవాలకు గురువారం పందిరి రాటవేసి శ్రీకారం చుట్టే సన్నాహాలు జరుగుతుండడంతో వీరు ఏలేరులో స్నానం ఆచరించడానికి వెళ్లి మృత్యువాత పడడం గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంతం కుటుంబీకుల రోదనలతో విషాదం అలుముకుంది.

# రాజమహేంద్రవరంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

» రెండు ఎకరాల స్థల సేకరణకు నిర్ణయం
» ఈ హబ్‌తో పారిశ్రామికవేత్తల గుర్తింపు
» హబ్ సభ్యులతో కలెక్టర్ ప్రశాంతి తొలి సమావేశం




సమావేశంలో పారిశ్రామికవేత్తలు, అధికారులతో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్టీఐహెచ్) ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీని కోసం రెండు ఎకరాల భూమిని కూడా సేకరించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆర్టీఐహెచ్ సభ్యులతో తొలి సమావేశం నిర్వహించారు. ఇందులో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, గ్రీన్ కోర్, ఓఎన్జీసీ, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీలు, ఎస్ఐటీఏ, జేఎన్‌టీవై ఎక్స్‌పెర్ట్ టీమ్, పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే సీఎం నారా చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యాచరణ లక్ష్యంగా గుర్తించిన వ్యక్తులను పరిజ్ఞానాన్ని అందించి, ఆలోచనల నుంచి నూతన ఆవిష్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరం, విశాఖ, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా, అనంతపురం జిల్లాల్లో ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో సరైన దిశా నిర్దేశం చేయడంతోపాటు వారికి తగిన నాలెడ్జి అందించాలన్నారు. బోర్డ్ కోర్ కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్‌కోర్ సీఈవో, ప్రమోటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. సహ ప్రమోటర్‌గా ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు, ఎక్స్‌పెర్ట్ కమిటీ సభ్యులుగా జేఎన్‌టీయూ, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సభ్యులు వ్యవహరిస్తారన్నారు. సాంకేతిక పురోగతి, మార్కెట్ మార్పులు, స్టార్టప్‌ల అభివృద్ధి, అవసరాల నుంచి ఉత్పన్నమయ్యే అవకాశాలను ఉపయోగించుకోవడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. జిల్లా పరిధిలో ఫుడ్, ఆక్వా, అగ్రికల్చర్, అగ్రి వ్యర్థాలు, పామ్ ఆయిల్, కోకో, పిప్పర్, పూలు, మొక్కలు ఆధారిత యూనిట్లు, సేవారంగం, జీడిపప్పు పరిశ్రమ తదితర అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఎ.గోపాలకృష్ణ, ఎస్ఐటీఏ డైరెక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, గ్రీన్‌కో సీఈవో పి.రాంబాబు, ఐటీయూ అండ్ సీ-ఓఎస్‌డీ ఆర్.దీప్తి, గెయిల్ అధికారి డి.ప్రభాకర్, ఓఎన్‌జీసీ అధికారి జి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఆర్ఎంసీ నుంచి కొండలరావు, మెప్మా శ్రీదేవి పాల్గొన్నారు.

# గంజాయితో నలుగురి అరెస్టు

● రెండు కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం



రాయవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

రాయవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తుల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపా రు. గురువారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడి శివారు బండిరేవు పుంత వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు దాడిచేసి బండిరేవు పుంతవద్ద ప్లాస్టిక్ కవర్లతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రామచంద్రపురం పట్టణానికి చెందిన కొగరు రామతేజ, మణిపూడి శ్రీసాయి వెంకటేశ్వరరావు, పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన కల్యాణవెంకట కుమార్, సత్తి దుర్గా ప్రసాదరెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నలుగురు వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగడానికి అలవాటు పడటంతోపాటు ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో దారకొండ ఏజెన్సీ నుంచి కిలో గంజాయి సుమారు రెం డువేలకు కొనుగోలుచేసి రూ.10వేలకు విక్రయాలు సాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కొనుగోలుచేసి అమ్మకాలు సాగించేందుకు తెచ్చిన గంజాయిని పంప కాలు చేసే సమయంలో నలుగురినీ అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు సాగుతుందని మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

### తుని మున్సిపాలిటీపై

# టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్

● 28న ఎన్నిక ప్రక్రియ

తుని రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీపై టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్ అయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 28న ఈరెండు పదవులకు ఎన్నిక లాంఛన ప్రాయమే. 30మంది సభ్యులుగల తుని మున్సిపాల్టీలో టీడీపీ సంఖ్యా బలం 17. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ల అభ్యర్థుల ఎంపికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో తేటగుంట క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. చైర్మన్‌గా నార్ల భువనేశ్వరి, వైస్‌చైర్మన్‌గా ఆచంట సురేష్ పేర్లపై కౌన్సిలర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు యనమలకు కౌన్సిలర్లు ఏకాభిప్రాయం తెలియజేశారు. పట్టణ నేతలకు దిశానిర్దేశం చేసిన యనమల రామకృష్ణుడు అందరూ సమిష్టి నిర్ణయంతో జయభేరి మోగించాలన్నారు. ఇన్‌చార్జ్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ చైర్మన్లు యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, సత్యనారాయణ, సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, నార్ల రత్నాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



యనమలతో సమావేశమైన తుని మున్సిపల్ కౌన్సిలర్లు

### ధ్రువపత్రాల పరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య కారణాల కిం ద బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యా యులకు కాకినాడ జీజీహెచ్‌లో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 192మంది వైద్య ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిని వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య పర్యవేక్షించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని

### యువకుడి మృతి



లోవరాజు మృతదేహం

శంఖవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాసేపట్లో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో ఆనందంగా ఉండాల్సిన యువకుడిని మృత్యువు కబళించింది. ఆ ప్రమాదం యువకుడి ఇంట శోకాన్ని మిగిల్చింది. శంఖవరం మండలం వేళంగి పంచాయతీ పరిధి ధారమల్లాపురం గ్రామానికి చెందిన ఆపూరి లోవరాజు(22) గురువారం బైక్‌పై ఇంటినుంచి రౌతులపూడి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రత్తిపాడు మండలం కొత్త అచ్చింపేట సమీపంలో విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా తలకి బలమైన గాయాలవడంతో అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

విద్యుదాఘాతంతో


### దింపు కార్మికుడి మృతి



కోలా ధనరాజు (ఫైల్)

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలోని చిక్కాలలో కొబ్బరి దింపు కార్మికుడు విద్యు దాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన కోలా ధనరాజు (22) తోటి కొబ్బరి కాయల దింపు కార్మికులతో కలిసి పనికి వెళ్లాడు. కొబ్బరి చెట్టు నుంచి కాయలు దించుతుండగా అతనే నరికిన కొబ్బరి ఆకు ప్రక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు అతనిని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిన ట్లు వైద్యులు చెప్పారు. ఈ విషయమై మృతుడు అన్నయ్య శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడుకి ఇంకా వివాహం కాలేదు.

### రైలు నుంచి జారిపడి మహిళ మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన మహిళ

తునిరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పో లీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. రైల్వే ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకా రం.. నరసింగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ వయస్సు 35ఏళ్లు ఉంటుందని, మృతురాలి వద్ద ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులకుగాని సంబంధిత ఫోన్ నెంబర్ 94906 19020గాని సంప్రదించాలని కోరారు.

# బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్ట్



జి.వేమవరంలో కిడ్నాపర్‌ని అరెస్టు చేస్తున్న ఎస్ఐ

తాళ్లరేవు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరంలో బాలుడు ఫణివర్ధన్‌ని కిడ్నాప్ చేసిన చొల్లంగిపేటకు చెందిన కుంది అబద్దాలును అరెస్ట్ చేసినట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ గురువారం తెలిపారు. సదరు అయిన విల్లి కాశీ కృష్ణభగవాన్ గత 3 సంవత్సరాల క్రితం కుంది అబద్దాలు వద్ద రూ.1,20,000 అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులను రాబట్టేందుకు కుంది అబద్దాలు కాశీకృష్ణ భగవాన్ రెండవ కుమారుడు ఫణివర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. ఫణివర్ధన్‌ని కిడ్నాపర్ నుంచి రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. కిడ్నాపర్‌ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

# చేబ్రోలులో మళ్లీ డయేరియా

కొత్తగా పది కేసులు
ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అధికంగా రోగులు



చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకి నాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మళ్లీ డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. పీహెచ్‌సీతో పా టు ప్రైవేటు ఆసుపత్రులకు వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతూ రోగులు అధికంగా వస్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో ఐదుగురు రోగులు చికిత్స పొందారు. ఇంటింటా సర్వైలెన్స్‌లో మరో ఐదు కేసులను గుర్తించారు. వీరుగాక ప్రైవేటు ఆసుపత్రుల్లో పది మందికిపైగా రోగులు చికిత్స పొందుతున్నారు. డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఎంహెచ్‌వో ప్రకటించి 24 గంటలు గడవక ముందే మరలా డయేరియాతో రోగులు అధికంగా రావడం ఆందోళన కలిగిస్తోంది. డయేరియా ప్రబలడానికి అసలు కారణాన్ని అధికారులు గుర్తించకపోవడమే ప్రధానకారణంగా భావిస్తున్నారు.

# అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రూ.5లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం ఠాణేలంక పంచాయతీ పరిధిలోని బలుసుల్లంకలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.5లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో చిన్నం ప్రసాదరావుకు చెందిన తాటాకిల్లు కాలి బూడిదైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కొండబాబు తెలిపారు. వ్యవసాయ కూలీ పనులకు చిన్నం ప్రసాదరావు, అతని భార్య వెళ్లగా కుమారులు ఇరువురు తాపీ పనులకు వెళ్లిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల వారు గుర్తించేసరికే మంటలు చుట్టుముట్టడంతో ప్రమాదంలో సర్వం కాలి బూడిదయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ.60వేలు నగదు, బంగారపు వస్తువులు, గ్యాస్, విద్యుత్ మీటరు, గృహోపకరణాలు మొత్తం ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ముమ్మిడివరం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు, నారాయణలతోపాటు సిబ్బంది పాల్గొని మంటలు అదుపు చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



రెండు కుటుంబాల మధ్య

# వివాదం

● నలుగురికి గాయాలు



గాయపడ్డ మల్లాడి చినవీర్రాజు

కాట్రేనికోన, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం మత్స్యకార గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో నలుగురు గాయపడ్డారు. పంచాయతీ పరిధిలోని కుళాయిలవద్ద నీరు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళలు ఒకరిని ఒకరు దూషించుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం నేపథ్యంలో మల్లాడి చినవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్ కుటుంబాలు కొట్లాటకు దిగాయి. ఈ కొట్లాటలో మల్లాడి చినవీర్రాజువర్గంలో చినవీర్రాజు, లక్షణ్ వర్గంలో మల్లాడి ధర్మారావు, మల్లాడి ధనావతి, మల్లాడి లక్ష్మణ్ గాయపడినట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. గాయపడిన వారు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# నా ప్రాణాలకు ముప్పు ఉంది

● రక్షణ కల్పించండి
● సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో నివసిస్తూ ఫణి గ్యాసెస్ సంస్థలో పనిచేస్తున్న సజ్జా రాము అనే వ్యక్తిపై మరొక గ్యాస్ కంపెనీకి చెందిన అభి, అనిల్, గంగాధర్‌రావు, మహేష్ అనే నలుగురు వ్యక్తులు తన ఇంటికి వచ్చి తన అంతుచూస్తామని బెదిరించడంతో తన ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని సామర్లకోట పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఇక్కడ లోకల్‌గా ఉన్న గ్యాస్ కంపెనీలు నిర్వహిస్తున్న తమకు నాన్‌లోకల్ అయిన మోహనరావు కంపెనీ వ్యాపారాల వలన తమ వ్యాపారం కుంటుపడుతుందని పేర్కొంటూ తనను బెదిరించి నట్లు పోలీసులకు తెలిపారు. తన ప్రాణాలకు రక్షణ కల్పించి తనను బెదిరిస్తున్న వారి నుంచి తనకు శాశ్వత రక్షణ కల్పించాలని సీఐకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణి గ్యాస్ కంపెనీ అధినేత మోహనరావు కూడా ఫిర్యాదు అందజేసిన వారిలో ఉన్నారు. కాగా ఆరోపణలకు గురైన వారిని స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించి ఎవరివ్యాపారాలు వారు చేసుకోవాలని సీఐ కృష్ణభగవాన్ హెచ్చరించారు.

### యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24( ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఇంటి వద్ద ఉంటుంది, ఈ క్రమంలో ఇంటి నుంచి బుధవారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు ఆ యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పిఠాపురం పట్టణం అగ్రహారంలో నిర్వహిస్తున్న కబేళాకు తాళాలు వేస్తున్న మునిసిపల్ కమిషనరు కనకారావు, సిబ్బంది

# అగ్రహారంలో కబేళా మూసివేత

● హైకోర్టు ఆదేశాలతో మునిసిపల్ అధికారుల చర్యలు

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో కబేళాకు ఎట్టకేలకు తాళాలుపడ్డాయి. నివాస ప్రాంతాల మధ్య పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న జంతు వధశాలను మూసివేయాలని కలెక్టర్, హైకోర్టు ఆదేశించినా మునిసిపల్ అధికారులు అమలు చేయట్లేదంటూ కాకినాడకు చెందిన యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోపాలరావు హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. రెండు రోజుల్లో కబేళాను మూసివేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ కనకారావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది గురువారం కబేళాకు తాళాలు వేసి దానిని మూసివేస్తున్నట్టు నోటీసులు అంటించారు.

# ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు

● 12 గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24( ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు జీరో పాయింట్‌వద్ద ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. దివాన్‌చెరువు గ్రామ సమీపంలో ఈనెల 10న ఒక మహిళ రోడ్డుపై నడిచి వెళుతుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో బంగారు వస్తువులను లాక్కెల్లారు. ఈ సంఘటనలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు. ఈ చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఒడిస్సాకు చెందిన పాత నేరస్తుడు కె.సూర్యారావు, అల్లూరిజిల్లాకు చెందిన ఉమాశంకర్ అని పోలీసులు గుర్తించారు. వారిని గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కె. సూర్యరావు, ఉమాశంకర్‌లపై గంజాయి, చెయిన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

### ప్రేమపేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం దేవీచౌక్ సమీపంలో ఎస్కే కోచింగ్ సెంటర్‌లో కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న ఎస్.రాంబాబు అనే యువకుడు తనను వివాహం చేసుకుంటానని చెప్పి ప్రేమపేరుతో మోసం చేశాడని బాధిత యువతి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. దేవపల్లికి చెందిన 20 ఏళ్ల యువతి రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ఉన్న ఎస్కే కోచింగ్ సెంటర్‌లో పోటీ పరీక్షలకు శిక్షణకోసం 2022 నుంచి వచ్చి వెళుతుంది. ఈ క్రమంలో విజయనగరానికి చెందిన రాంబాబుతో పరిచయం ఏర్పడింది. దీంతో తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమించాడని తన అవసరం తీరాక రాంబాబు పెళ్లి చేసుకోనని మొఖం చాటేశాడని నిలదీస్తే కులం పేరుతో అవమానించాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

## ఓఎన్జీసీ పనులు అడ్డుకునేందుకు రంగం సిద్ధం



ఓడలరేవులో ఓఎన్జీసీ దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి

అల్లవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం ఓఎన్జీసీ ప్లాంటు పనుల స్తంభనకు రంగం సిద్ధమైంది. ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్ వద్ద గురువారం 53వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకట రామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, గ్రామస్తులు, మహిళలు రిలే దీక్షల్లో నిరసన తెలిపారు.

## ఇంటర్ సిలబస్‌కు అనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సిలబస్ మారడంతో పాటు ప్రశ్నాపత్రంలో ఒక మార్కు ప్రశ్నలు పదిశాతం చేరుస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. మారిన సిలబస్‌కు అనుగుణంగా ఉపన్యాసకులకు గురువారం నుంచి మే 6 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లాలోని అధ్యాపకులకు అమలాపురం బాలికల జూనియర్ కళాశాలలో టీచర్స్ ఆన్‌లైన్ ఒరియంటేషన్ ప్రోగ్రాం ఆన్ న్యూ సిలబస్ అండ్ క్వశ్చన్ ప్యాటర్న్ పేరుతో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంగ్లీషు, తెలుగు, హిందీ బోధిస్తున్న ఉపన్యాసకులకు తొలిరోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. తొలిరోజు ఇంటర్మీడియట్ విద్యా కమిషనర్ కృతికాశుక్లా ప్రారంభోపన్యాసం చేస్తూ ఇంటర్ విద్యావిధానంలో మార్పులకు అనుగుణంగా ఉపన్యాసకులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రొఫెసర్ కృష్ణకాంత్ పేపర్ మోడల్, సిలబస్ గురించి వివరించినట్టు డీఐఈవో సోమశేఖరరావు తెలిపారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ముమ్మిడివరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనాతవరం గ్రామ పంచాయతీలో బుధవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ ఎం. చిరంజీవి, కురసాల శివబాబు, పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌కేవీ సురేష్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యవర్గ సభ్యులు, పలువురు పాల్గొన్నారు

**అల్లవరం, (ఆంధ్రజ్యోతి):** పంచాయతీరాజ్ చట్టం గ్రామాల అభివృద్ధికి పట్టుకొమ్మ అని అమలాపురం ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ వద్ద ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవ సభలు జరిగాయి. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిపై ఆయా సభల్లో ప్రసంగించారు. డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్‌లు చిట్నీడి శ్రీదేవి, కడలి గంగాచలం, సాధనాల వెంకట్రావు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, రాయుడు విష్ణు, ఎంపీటీసీలు ఎస్.మౌనికవరలక్ష్మి, తిక్కా శేషుబాబు తదితరులు ఆయా సభల్లో పాల్గొన్నారు.

**అంతర్వేది, (ఆంధ్రజ్యోతి):** సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారి సీహెచ్ గంగాధరరావు, ఏపీవో ఎండీ నాగప్రసాద్, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు, ఎంపీటీసీ సభ్యులు చొప్పల బాబూరావు, కె.నాని తదితరులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్లు ప్రారంభం

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు పాల్గొని గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. మాచవరం గ్రామంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, ఎస్. వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవం జరిగింది. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి తదితరులు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరావు, పరిపాలన అధికారి వీవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**రాజోలు, (ఆంధ్రజ్యోతి):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీను ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని గాంధీజీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, ఇంటిపల్లి ఆనంద రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పంచాయతీ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ముందుగా పహల్గాం మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన పంచాయతీ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జడ్పీటీసీ ప్రసన్నకుమారి, ఉప ఎంపీపీ నిర్మల, ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, కార్యాలయం ఏవో మిల్టన్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ రాజన్, ఎలక్ట్రికల్ ఏఈ బి.ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### మధుచంద్రికకు అభినందనలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 597 మార్కులు సాధించిన తురగా మధుచంద్రికను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు గురువారం అభినందించి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు విజయలక్ష్మి-కుమార్‌రామ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరి శ్రీనివాస్, జిల్లెల్ల గోపాల్, చిన్నా, పవన్, శివ, అద్దంకి భాస్కర్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.



మధుచంద్రికను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు తదితరులు

## యానాంలో పుదుచ్చేరి కలెక్టర్ పర్యటన

యానాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కలెక్టర్ కులోత్తంగన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా యానాం వచ్చారు. పుదుచ్చేరి నుంచి రాజమండ్రి వచ్చిన అయన్ను విమానాశ్రయం వద్ద యానాం పరిపాలనాధికారి మునిస్వామి ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో యానాం చేరుకున్నారు. యానాం ప్రభుత్వ అతిధిగృహం వద్ద వివిధ శాఖల అధికారులు స్వాగతం పలికారు.

**డంపింగ్ యార్డు ప్రాంతాల పరిశీలన:** యానాం పర్యటనకు వచ్చిన కలెక్టర్ యానాం ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతాలను యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణలతో కలిసి పరిశీలించారు. గోపాల్‌నగర్‌లోని సబ్‌స్టేషన్ పరిశీలించేందుకు కలెక్టర్ వచ్చే సమయానికి అక్కడ ఉన్న స్థానికులు నినాదాలు చేశారు. ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్దంటూ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నినాదాలు చేశారు. శుక్రవారం కూడా డంపింగ్‌యార్డు సమస్యపై పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

## పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి సత్కారం

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన శ్రీబాలాజీ హైస్కూలు విద్యార్థిని పోతుల శరణ్యను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం సత్కరించారు. పది పరీక్షల్లో 595 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచిన పోతుల శరణ్యను ఎమ్మెల్యేతో పాటు, సీఐ ఎం.మోహన్ కుమార్, టీడీపీ నాయకులు సత్కరించి అభినందించారు. శరణ్య తండ్రి శామ్యూల్, తల్లి స్వర్ణకుమారి దంపతులను వారు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాడి నరసింహారావు, పి.నారాయణరావు, మెండి కమలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య

అమలాపురం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారని ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పేర్కొన్నారు. తల్లిదండ్రులు కోరిక మేరకు ఆంగ్లంలో విద్యాబోధన జరుగుతుందన్నారు. వన్నెచింతలపూడి ముంగండ వారిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం పాఠశాల హెచ్ఎం పరసా సూర్యకుమారి ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల విజేతలను డీవైఈవో సూర్యప్రకాశం అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరమట నాగమణి, స్కూలు కమిటీ చైర్మన్ ముంగండ రాంబాబు, రెడ్డి పద్మావతి, పోతుల సౌజన్య, ముంగండ శ్రీను, స్కూలు కాంప్లెక్సు కార్యదర్శి బద్రి శ్రీనివాసరావు, యాళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అద్భుతాలు సృష్టించేందుకు అటల్ ల్యాబ్స్



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అద్భుతాలు సృష్టించేలా అటల్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని యూనిసెఫ్ స్టేట్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించే అటల్ బూట్ క్యాంపును గురువారం వారు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు కేఏఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుదర్శన్, సలీంబాషాలు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించి ప్రయోగాత్మకంగా వారిని తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ ల్యాబ్స్‌ను మంజూరు చేసిందన్నారు. సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి అయోగ్ సూచనల మేరకు 45 అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మంజూరయ్యాయన్నారు. అటల్ బూట్ క్యాంపులో విద్యార్థులు రూపొందించిన పలు ప్రయోగాలను ప్రదర్శించారు. వాటిని డీఈవో సలీంబాషా, కన్సల్టెంట్ సుదర్శన్‌లు పరిశీలించారు. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం మృతులకు ఆత్మశాంతి కోరుతూ మౌనం పాటించారు. సమావేశంలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎస్వో కె.నారాయణరావు, అటల్ హబ్ ఇన్‌చార్జి, ఉపాధ్యాయులు కె.పద్మావతి, కె.పావని, ఎన్.శివప్రసాద్, బి.గౌరీప్రసాద్, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడి దారుణం



ముమ్మిడివరంలో కొవ్వొత్తులతో జనసేన నాయకుల శాంతి ర్యాలీ

ముమ్మిడివరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ముమ్మిడివరంలో జనసేన పార్టీలో ఆధ్వర్యంలో గురువారం రాత్రి శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సమైక్యాంధ్ర ఉద్యమ శిబిరంలో నిరసన తెలిపి అక్కడి నుంచి హైస్కూలు సెంటర్ వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గుద్దటి జమి, డి.స్వామి, ఎం.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి

**అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):** జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి దారుణమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఉగ్రవాద దాడిని నిరసిస్తూ స్థానిక సెంటర్లో అఖిలపక్షం ఆధ్వర్యం లో కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### బీజేపీ ర్యాలీ

**మలికిపురం, (ఆంధ్రజ్యోతి):** కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ గాంధీబొమ్మల కూడలి నుంచి మలికిపురం డిగ్రీ కళాశాల వరకు బీజేపీ రాజోలు నియోజకవర్గ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని మోదీకి అండగా ఉందాం

**ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి):** అమాయకులను బలి తీసుకోవడం ద్వారా పాక్ ఉగ్రవాదులు మన దేశ ఆర్థిక, రాజకీయ సుస్థిరతకు భంగం కల్గించాలని కుట్రపన్నారని అమలాపురం మాజీ ఎంపీ, టీడీపీ నాయకుడు ఏజేవీ బుచ్చిమహేశ్వరరావు ఆరోపించారు. గురువారం ఆయన గోపవరంలో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, అఖిలపక్షం ప్రధానికి వెన్నుదన్నుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**రాజోలు, (ఆంధ్రజ్యోతి):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం దారుణమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలులో తహశీల్దార్ కార్యాలయం వద్ద నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాజోలు మండల జనసేన అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, రాజోలు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

**పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి):** జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల చేసిన దాడి హేయమైనదని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. పి.గన్నవరం సెంటర్‌లో వైసీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొవ్వొతుల ర్యాలీలో ఆయన మాటాడారు. తొలుత పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్ నుంచి స్థానిక సినిమా థియేటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, ఎం.కిరణ్‌కుమార్, నక్కా చినవెంకటేశ్వరావు, వీకే రావు తదితరులు పాల్గొన్నారు.

### పహల్గాం మృతులకు నివాళి

**అమలాపురం టౌన్ (ఆంధ్రజ్యోతి):** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిపారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

### కొవ్వొత్తులతో ర్యాలీ

**అల్లవరం, (ఆంధ్రజ్యోతి):** కశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మొగళ్లమూరి, అల్లవరం గ్రామాల్లో గురువారం రాత్రి కొవ్వొత్తుల నిరసన ర్యాలీలు జరిగాయి. బీజేపీ మండలాధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, భజరంగ్‌దళ్ మండల ప్రముఖ్ అల్లు అజయ్ తదితరులు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

**అంతర్వేది, (ఆంధ్రజ్యోతి):** పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా మృతులకు నివాళులర్పిస్తూ సఖినేటిపల్లి సెంటర్‌లో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పోతురాజు సురేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్ష నాయకులంతా ర్యాలీలో పాల్గొని ఉగ్రదాడుల్లో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

### జనసేన ఆర్థికసాయం

అంబాజీపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, రోడ్డు ప్రమాదాలకు గురై చికిత్స పొందుతున్న వారి కుటుంబాలకు జనసేన నేతలు సమకూర్చిన నగదును పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాధితులకు అందచేశారు. మాచవరం మెట్లకాలనీలో ప్రమాదానికి గురైన చికిలే సాగర్ కుటుంబానికి రూ.10వేలు, పెరాలసిస్‌తో బాధపడుతున్న నెల్లి బాలమురళీకృష్ణకు రూ.15వేలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీరు అందించేందుకు కృషి

అయినవిల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం కొండుకుదురు గ్రామం గున్నంమెరకలో మంచినీటి ట్యాంక్, పైపులైను, యలకల్లంకలో మంచినీటి ట్యాంకు, పైపులైను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

అమలాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపును రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్ బాబు మాట్లాడుతూ క్యాంపులో అనుభవజ్ఞులైన కోచ్‌లతో వంద మందికి పైగా యువ ఆటగాళ్లకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్, ఉపాధ్యక్షురాలు రంకిరెడ్డి రంగమణి తదితరులు పాల్గొన్నారు.

### దేవస్థానంలో ప్రత్యేక వసతులు

మామిడికుదురు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్టు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఓఎన్జీసీ సమకూర్చిన నిధులతో దేవస్థానంలో ఏర్పాటుచేసిన మంచినీటి శుద్ధి కర్మాగారాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. కార్య క్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

### పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు

పి.గన్నవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండల పరిధిలో ఉన్న అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు ఎంఈవో కె.హెలీనా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. వివరాలకు 9985229616, 9989383288 లో సంప్రదించాలని ఎంఈవో కోరారు.

## మెగా డీఎస్సీని కొన్ని రోజులు వాయిదా వేయండి



అమలాపురంలో కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఈడీ విద్యార్థులు

అమలాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన డీఎస్సీ పరీక్షను కొన్ని రోజులపాటు వాయిదా వేయాలని కోరుతూ బీఈడీ 2023-25 ఫైనల్ ఇయర్ విద్యార్థులు గురువారం వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం డీఎస్సీలో 16వేల పోస్టులు ఉన్నప్పటికీ ఒక నెలజాప్యం వల్ల సుమారు 10వేల మంది బీఈడీ విద్యార్థులు ఈ అవకాశాన్ని కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని, భవిష్యత్తులో మెగా డీఎస్సీ ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పలేని పరిస్థితుల వల్ల వాయిదా వేయాల్సిందిగా అమలాపురంలోని బీఈడీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులు, బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు రెవెన్యూ క్విజ్ పోటీలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూపరిపాలన అంశాల్లో తీసుకువచ్చిన అధునాతన చట్టాలు, సాంకేతికతను అమలులోకి తీసుకువచ్చిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది సామర్థ్యాలు, విధులు, బాధ్యతల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్డీవోలు, తహశీల్దార్‌లను సమన్వయం చేసుకుని 22 మండలాల్లో క్విజ్ పోటీలు జరిపించాలన్నారు. రెవెన్యూ చట్టాలు, తాజా ప్రభుత్వ ఉత్తర్వులపై అవగాహన పెంపొందించేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయన్నారు. మండలస్థాయిలో క్విజ్ పోటీల విజేతలకు మేలో జరగనున్న జిల్లాస్థాయి రెవెన్యూ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. ప్రతి ఉద్యోగి తమ సృజనాత్మకతను నిరూపించుకుంటూ ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు.

### వేసవి ప్రత్యేక తరగతులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సబ్జెక్టుల వారీగా పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవిలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-2 ఆర్.ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం వేసవి ప్రత్యేక తరగతుల శిబిరాన్ని ప్రధానోపాధ్యాయుడు బి.హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో-2ఆర్.ఉదయబాస్కరరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్‌లలో కనీస పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి మే 10 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఎస్ సబ్జెక్టు ఇన్‌చార్జి జి.శ్రీనివాస్, ఎన్ఎస్ ఇన్‌చార్జి ఏజీ కృష్ణ, ఉపాధ్యాయులు శివనాగరాజు, బ్రెస్సింగ్టన్, దుర్గారావు, భవానీ, హిమబిందు, నాగరమేష్‌లు పాల్గొనగా ఫిజిక్స్ ఫోరం తరఫున భవానీ, ఎంఈవో-2 ఉదయంబాస్కర్, హిమబిందులు నగదు అందజేయగా వీటితో మంచినీరు, స్నేక్స్ సమకూర్చనున్నట్టు హెచ్ఎం తెలిపారు.

### రీసర్వేతో సమస్యలు పరిష్కారం

ఐ.పోలవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రీసర్వే సభల ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలో గురువారం జరిగిన గ్రామసభలో ఆర్డీవో కె.మాధవితో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. దీనివల్ల ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప, బలుసుతిప్ప, దొంతికుర్రు, నడవపల్లి, గెద్దనపల్లి, కుండలేశ్వరం, వేట్లపాలెం, జీకే పొర, చిర్రయానాం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై భార్యతో తగువుపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తోట శ్రీరామ్ (22) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 17న శ్రీరామ్ భార్యతో తగవుపడి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీరామ్ గురువారం మృతి చెందినట్టు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అతనికి భార్య సంధ్య, రెండేళ్ల కుమారుడు నాగచైతన్య ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

### కంచి డీమ్డ్ యూనివర్శిటీ స్పాట్ అడ్మిషన్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంచిలోని శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతి మహావిశ్వవిద్యాలయం (డీమ్డ్ యూనివర్శిటీ)లో వివిధ కోర్సులకు సంబంధించి గురువారం అమలాపురంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, డీన్ కె. వెంకటరమణ మాట్లాడుతూ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. యూనివర్శిటీ ఫ్యాకల్టీ డాక్టర్ దండిబొట్ల నాగేశ్వరరావు తదితరులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగల్ సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ నెల 25న రాజమహేంద్రవరంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 96550 35217లో సంప్రదించాలన్నారు.

### చెత్త సమస్యను పరిష్కరించాలి

యానాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త సమస్యను పరిష్కరించాలంటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో ప్రజా నిరసన చేపట్టారు. తన అభిమానులతో కలిసి పుదుచ్చేరి వెళ్లిన గొల్లపల్లి సీఎం రంగస్వామి, హోంమంత్రి నమశ్శివాయం తదితరులను కలిసి యానాంలో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సమస్య పరిష్కరించే వరకు తాను పుదుచ్చేరి నుంచి వెళ్లేది లేదని నిరాహారదీక్షకు దిగుతానన్నారు.

### పట్టాలు పంపిణీ చేయాలి

ఐ.పోలవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లంక భూములను జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సభ్యులకు ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేయాలని గురువారం మురమళ్లలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆర్డీవో మాధవిలకు సంఘ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. మిగులు లంక భూములను గుర్తించి ఇళ్ళ పట్టాలుగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

### దివంగత ఎస్ఐ సత్యనారాయణ జ్ఞాపకార్థం

## మహాప్రస్థానం వాహనం అందజేత




మహాప్రస్థానం వాహనం

కె.గంగవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం గ్రామానికి చెందిన దివంతగ ఎస్ఐ ఆదుర్తి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మహాప్రస్థానం వాహనాన్ని గ్రామానికి అంకితం చేశారు. సుమారు రూ. ఏడు లక్షలతో కొనుగోలు చేశారు. దీనికి పంచాయతీ పరిధిలో ఒక షెడ్డును రూ. మూడులక్షలతో నిర్మించారు. గ్రామ పరిధిలోని 15 కిలోమీటర్ల వరకూ వాహనాన్ని ఉపయోగించుకోవచ్చునని, డీజిల్‌కు రూ. 500, డ్రైవర్‌కు రూ. 500 చెల్లించాలని నిబంధన పెట్టారు. వాహనాన్ని గురువారం పంచాయతీకి అప్పగించారు.

చివరి మజిలీ కోసం ఆదుర్తి సత్యనారాయణ కుటుంబం చేసిన పనికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఆత్రేయపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు విద్యాహక్కు చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్ పేర్కొన్నారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలు 12(1) సీ రిజిస్ట్రేషన్ ఈ నెల 26లోపు పూర్తిచేయాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 25శాతం 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 28 నుంచి మే 15 వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ప్రాథమిక వివరాలతో దరఖాస్తును వెబ్‌సైటులో సమర్పించాలన్నారు. విద్యార్థుల ప్రవేశాలకు మార్చి 31 నాటికి ఐదు సంవత్సరాలు పూర్తై ఉండాలన్నారు. లాటరీ ద్వారా మొదట విడత ఫలితాలు మే 21, 24 మధ్యలో విడుదల చేస్తామని సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాలు జూన్ 2న నిర్ధారిస్తామన్నారు. 2వ విడత ఫలితాలు జూన్ 6న విడుదల చేస్తామన్నారు.

## ప్రతి కార్మికుడు ఈశ్రమ్ కార్డులు తీసుకోవాలి

రాయవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ కార్డులను ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టీఎస్ కార్తీక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మే 22 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈశ్రమ్ కార్డులపై అసంఘటిత కార్మికులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అసంఘటిత రంగంలో ఉండి 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు లోపు వారు అర్హులన్నారు.

## ‘వైసీపీని బలోపేతం చేయటమే లక్ష్యం’

మండపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయటమే లక్ష్యమని కోనసీమ జిల్లా నూతన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చెప్పారు. గురువారం మండపేట పట్టణంలోని వైసీపీ కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన జగ్గిరెడ్డికి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ఒకరికొకరు సత్కరించుకున్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ నేతలు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, రెడ్డి రాజబాబు, కర్రి పాపారాయుడు, షేక్ ఆలీఖాన్ బాబా, పట్టణ వైసీపీ అధ్యక్షుడు ముమ్మిడి వరప్రసాద్ బాపిరాజు, సుధాకర్, ఎంపీపీలు ఉండమట్ల వాసు, నౌడు వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### పట్టాలు పంపిణీ చేయాలి

ఐ.పోలవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లంక భూములను జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సభ్యులకు ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేయాలని గురువారం మురమళ్లలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆర్డీవో మాధవిలకు సంఘ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. మిగులు లంక భూములను గుర్తించి ఇళ్ళ పట్టాలుగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం





ద్వారపూడిలో పంచాయతీరాజ్ ధినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, కపిలేశ్వరపురంలో కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీవో రత్నకుమారి

మండపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ద్వారానే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వున్న 12 పంచాయతీల్లో కార్యక్రమాన్ని జరుపుకున్నారు. పంచాయతీల వద్ద ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ద్వారపూడిలో పంచాయతీ కార్యదర్శి ఆకుల వీ.వీరమణ, నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆర్తమూరులో సర్పంచ్ గోలు గూరి అన్నపూర్ణ నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మండల పంచాయతీ వీస్తరణాధికారి దాసరి శ్రీని వాసరావు ఆధ్వర్యంలోనూ జరిగాయి. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుబ్బారావు, అమర్‌నాథ్, పి.శ్రీనివాస్, ప్రసాద్, అనిల్, వర్మ, ప్రత్యేకాధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కె. రత్నకుమారి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను సన్మానించారు. ఎంఈవో కె. తాతారావు, కార్యాలయ ఏవో రాజేంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డీ మోహన్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు కె.శ్రీనివాసరెడ్డి, వీరభద్రరాజు, కార్యదర్శి కె. శివచక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

**రాయవరం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ స్థానిక ఎంపీడీవో ప్రాంగణంలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో ఆయా పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ దినోత్సవాన్ని నిర్వహించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఏవో గోపాల్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ

### కంచి డీమ్డ్ యూనివర్శిటీ స్పాట్ అడ్మిషన్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతిస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంచిలోని శ్రీచంద్రశేఖరేంద్రసరస్వతి మహావిశ్వవిద్యాలయం (డీమ్డ్ యూనివర్శిటీ)లో వివిధ కోర్సులకు సంబంధించి గురువారం అమలాపురంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గుళ్లపల్లి శ్రీనివాస్, డీన్ కె. వెంకటరమణ మాట్లాడుతూ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. యూనివర్శిటీ ఫ్యాకల్టీ డాక్టర్ దండిభొట్ల నాగేశ్వరరావు తదితరులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగల్ సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ నెల 25న రాజమహేంద్రవరంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 96550 35217లో సంప్రదించాలన్నారు.

### చెత్త సమస్యను పరిష్కరించాలి

యానాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త సమస్యను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో ప్రజా నిరసన చేపట్టారు. తన అభిమానులతో కలిసి పుదుచ్చేరి వెళ్లిన గొల్లపల్లి సీఎం రంగస్వామి, హోంమంత్రి నమశ్శివాయం, తదితరులను కలిసి యానాంలో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సమస్య పరిష్కరించే వరకు తాను పుదుచ్చేరి నుంచి వెళ్లేది లేదని నిరాహారదీక్షకు దిగుతానన్నారు.

### నేడు రెవెన్యూ క్విజ్ పోటీలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భూపరిపాలన అంశాల్లో తీసుకువచ్చిన అధునాతన చట్టాలు, సాంకేతికతను అమలులోకి తెచ్చిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది సామర్థ్యాలు, విధులు, బాధ్యతల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్డీవోలు, తహశీల్దార్‌లను సమన్వయం చేసుకుని 22 మండలాల్లో క్విజ్ పోటీలు జరిపించాలన్నారు. రెవెన్యూ చట్టాలు అవగాహన పెంపొందించేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయన్నారు. మండలస్థాయిలో క్విజ్ పోటీల విజేతలకు మేలో జరగనున్న జిల్లాస్థాయి రెవెన్యూ క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు.

### ఏడోరోజుకు సామాజిక కార్యకర్త శ్రీవాణి దీక్ష

మండపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి స్థానిక కోకోకోలా సంస్థ నిధులు ఇస్తున్నా... స్థానిక నేతలు రాజకీయాల నడుమ ముందుకు సాగడం లేదని ఆ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆమె శాంతియుతంగా చేస్తున్న దీక్ష గురువారంతో ఏడోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రాజకీయాలకు అతీతంగా పాఠశాల ప్రహరీ నిర్మించే వరకు పోరాడతానని చెప్పారు.




కేశవరంలో ధర్నా చేస్తున్న శ్రీవాణి

### కేశవరంలో చలివేంద్రం ప్రారంభం

మండపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని కేశవరంలో ఆ గ్రామానికి చెందిన కుర్రా నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దూలం వెంకన్నబాబు, ముక్కపాటి శ్రీను చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## పర్యాటకులపై ఉగ్ర దాడి హేయమైన చర్య

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

### పలుచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీలు




వాడపాలెంలో సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్ముకాశ్మీర్ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడికి పాల్పడడం హేయమైన చర్యని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం వాడపాలెం పార్టీ కార్యాలయం వద్ద సంతాప సభ నిర్వహించారు. వాడపాలెం పార్టీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అలాగే మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బుల్లితాత, సాదే శ్రీనివాస్, బూసి భాస్కరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఆలమూరు:** కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి నిరసనగా మండలంలోని పెదపళ్లలో పార్టీలకు అతీతంగా నాయకుల అధ్వర్యంలో గురువారం రాత్రి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి నిరసనగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో కొవ్వొత్తులతో తిరుగుతూ దేశంలో ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి శ్రీనివాస్‌చౌదరి, నామాల రుద్రయ్యచౌదరి, గొడవర్తి రాంబాబు, బొబ్బా భాస్కరరావు, జాస్తి భాస్కరరావు, వట్టికూటి గణేష్, గొడవర్తి సురేష్, మేడవరపు బాబీతోపాటు అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**రావులపాలెం:** మారువేషంలో వచ్చి అమాయకుల ప్రాణాలు తీయడం పిరికిపంద చర్య అని, ఉగ్రవాదుల దాడులను ఖండిస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ అన్నారు. రావులపాలెం కోనసీమ ముఖద్వారం సమీపంలో బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్‌లో జరిగిన దాడిని ఖండిస్తూ మూడు రోజులు సంతాప దినాలు చేయాలంటూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి మౌనదీక్ష చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొక్కా ఆదినారాయణ, మండలాధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి, చేకూరి కృష్ణంరాజు, అంబటి కిషోర్, మోదూరి శివ, గుర్రాల సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోనసీమ ముఖద్వారం వద్ద గురువారం రాత్రి కొత్తపేట నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.




రావులపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

## పంచాయతీరాజ్ దినోత్సవం



ఆత్రేయపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు జడ్పీటీసీ బోనం సాయిబాబా, వైస్ ఎంపీపీ పెన్మత్స బంగార్రాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పంచాయతీ రాజ్ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు అందించిన అధికారాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రామస్వరూప్, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచ్‌లకు సత్కారం

ద్రాక్షారామ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్‌లు అల్లక సుందరరావు, కొండా అమ్మాజీ, గొల్లపల్లి పార్వతిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్. నాగవిజయమహేశ్వరి, దాకే ఆకాంక్ష, సూరంపూడి దిలీప్‌లను అభినందించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు దొంతంశెట్టి ఓం ప్రకాష్, కార్యదర్శి కారి రాకేష్, గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హసన్‌బాదలో మాజీ సర్పంచ్‌లను సత్కరిస్తున్న దృశ్యం

## పినపళ్ల పంచాయతీకి ఉత్తమ అవార్డు

» పేదరికం నిర్మూలన, జీవనోపాధి విభాగాల్లో పురస్కారం ప్రదానం

» అమరావతిలో సర్పంచ్ సుభాష్, కార్యదర్శి వీర్రాజు స్వీకరణ




అమరావతిలో అవార్డును స్వీకరిస్తున్న సర్పంచ్ సుభాష్

ఆలమూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలన, జీవనోపాధి విభాగాల్లో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పినపళ్ల పంచాయతీకి ఉత్తమ అవార్డు లభించింది. ఈ అవార్డును పినపళ్ల సర్పంచ్ సంగీత సుభాష్, కార్యదర్శి ఎస్.వీర్రాజు గురువారం అమరావతిలో జరిగిన పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణకుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో వివి ధ కేటగిరిలకు సంబంధించి పలు పంచాయతీలకు అవార్డులను అందించారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో పినపళ్ల పంచాయతీ చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

2021లో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి సుభాష్ సర్పంచ్‌గా గెలుపొందారు. అప్పటి నుంచి పినపళ్ల గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షల వ్యయంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన సుభాష్ సర్పంచ్‌గా తనదైన శైలిలో ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుం టూ ఎప్పటికప్పుడు గ్రామాభివృద్ధిపై చర్చిస్తూ నిధులను రాబట్టడంలో తనదైన ముద్ర వేసుకున్నారు. గ్రామంలోని జరుగుతున్న అభివృద్ధి పనుల తీరును పరిశీలించడానికి అనేక బృందాలు సర్వేలు నిర్వహించిన సంగతి తెలిసిందే. గ్రామపరిధిలో ఉన్న ఓఎన్జీసీ, పలు పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా ఆ విభాగంలో పినపళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు స్వీకరించి సర్పంచ్ సుభాష్, కార్యదర్శి వీర్రాజులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, ఎంపీడీవో ఎ.రాజు తదితర అధికారులు అభినందించారు.

## రేపు, ఎల్లుండి జాబ్‌మేళాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని కేవీఆర్ ఆసుపత్రి వద్ద ఉపాధి కార్యాలయంలో ఈనెల 26, 27 తేదీల్లో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 26న చిత్తూరు అమర్‌రాజా కంపెనీ నియామకాలు చేపడుతోందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ చదివిన 18 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థుల అర్హతను బట్టి ఎంపికైన వారికి 12-24 నెలలు శిక్షణా కాలంలోనెలకు రూ.12,500-రూ.15000 వరకు స్టైఫండ్, శిక్షణ అనంతరం రూ.22 వేలు(సీటీసీ) జీతం, ఉచిత భోజన వసతి కల్పిస్తారన్నారు. 27న తిరుపతి జిల్లా తడ గ్రామం శ్రీసిటీలోని హీరో మోటార్ కార్ప్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.20,000-22,000 జీతం చెల్లిస్తారన్నారు. రవాణా, భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 95154 81671 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## పదో తరగతి ఫలితాల్లో టాపర్స్‌కు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ ముల్లారావు

ఆలమూరు, ఏప్రిల్ 24(ఆంధ్ర జ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆలమూరు శ్రీ సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఎస్.కీర్తిభావన 590మార్కులు, పి.పృధ్వీనాథ్ 588 మార్కులు, బి.సుజాత, ఎస్ఎస్.సత్యశ్రుతి 585 మార్కులతో మండల స్థాయిలో టాపర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురువారం స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు అభినందించి సత్కరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ద్రాక్షారామ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు యత్నించిన రామచంద్రపురం మండల ఏరుపల్లికి చెందిన చవ్వాకుల సతీష్(35) బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సతీష్ వ్యవసాయంలో అప్పులపాలయ్యాడు. ఈనెల 21న గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### రెవెన్యూ సిబ్బందికి నేడు పోటీ పరీక్షలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డివిజన్ పరిధిలో రెవెన్యూ సిబ్బందికి ఈ నెల 25న పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో అఖిల తెలిపారు. ఇటీవల భూపరిపాలనా శాఖలో ప్రభుత్వం ఆధునిక సాంకేతికత, చట్టాలు అమలులోనికి తెచ్చిందని, వీటిపట్ల రెవెన్యూ, సర్వే సిబ్బందికి సామర్థ్యాలు, బాధ్యతల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు మండల పరిధిలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన వారికి జిల్లా వ్యాప్తంగా క్విజ్ నిర్వహిస్తామన్నారు. కె.గంగవరం, కపిలేశ్వరపురం ఎంపీడీవో కార్యాలయాలు, రామచంద్రపురం, రాయవరం, మండపేట తహశీల్దార్ కార్యాలయాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

### వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,23,364 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామికి భక్తులు ప్రదక్షిణలు చేశారు.

## వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆలమూరులో విద్యుత్ సమస్యల ప్రజా పరిష్కార వేదికలో అధికారులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఆలమూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి సమక్షంలో పరిష్కరించేందుకు ఆలమూరులో గురువారం విద్యుత్ సమస్యల ప్రజా పరిష్కార వేదికను నిర్వహించారు. కొత్తూరు సెంటర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కార వేదికకు పలు గ్రామాల నుంచి వినియోగదారులు వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదులు అందించారు. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు సురేఖరాణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబా, ఫైనాన్స్ సభ్యుడు సుబ్బారావుతోపాటు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ రాజబాబు, రామచంద్రాపురం డీఈ రత్నాలరావు, మండపేట ఏఈ శ్రీధర్, ఆలమూరు జేఈ దుర్గాప్రసాద్,పలువురు సిబ్బంది హాజరయ్యారు. వినియోగదారుల నుంచి వచ్చిన ప్రధాన సమస్యలపై చర్చించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని వారన్నారు.

### బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్

అమలాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన ఉచిత సమ్మర్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపును రూరల్ సీఐ డి.ప్రశాంత్ కుమార్ ప్రారంభించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కేఎస్‌బీపీ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిక్షణతో అత్యుత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు మాట్లాడుతూ క్యాంపులో అనుభవజ్ఞులైన కోచ్‌లతో వంద మందికి పైగా యువ ఆటగాళ్లకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్‌సాయిరాజ్, రంకిరెడ్డి రంగమణి పాల్గొన్నారు.